

# టీ కప్పులో తుఫాను

రచన:
కె. ప్రసాద్

రాత్రి సుమారు 11 అవుతుంది. చుట్టు గాఢాంధకారాన్ని దూసుకుంటూ తారాజువ్వలా రైలు పోతుంది. చక్రాలచప్పుడు అప్పుడప్పుడు గేదిపెయ్యలాంటి యింజను కూత, కప్పుల టెకటెకలుతప్ప మరేమీ వినిపించుటలేదు. ఆ పెట్టెలో కూర్చున్నవారిద్దరే. ఒక అడ, ఒక మగ. ఎడముఖం, పెడముఖం పెట్టుకొని, ధుమధుమలాడ్తున్న ముఖాలతో చెరొక పుస్తకము పట్టుకొని. నిజంగా చదువుతున్నారో, లేక చదువుతున్నట్లు నటిస్తున్నారో. ఇద్దరూ తలొకవైపు కూర్చున్నారు. యవ్వనవయస్కులు, నవనాగరికులు, అంతా గొప్పింటివారి లక్షణాలు. పంకాలు గిర్రున తిరుగుతున్నాయి. ఎవ్వరూ మాటాడుకోరు, అదేమి కర్మోగాని లేకపోతే అంత రాత్రప్పుడు ఎవ్వరూలేని పెట్టెలో యవ్వనవతి, సుందరాంగి తోటి ప్రయాణికురాలైతే, ఏ మగవాడు పలుకరించకుండా ఉండగలడు. అఖరుకి అందనిపండైనా, అందాన్నైనా కళ్ళారా చూచి అనందిస్తాడే. అటువంటిదేమీ మధు సూచించలేదు. చివరకు ఆమెవైపు చూడనైనాలేదు. మనస్సుమాత్రం రైలుబండిలా ఆలోచనలతో నిండిపోయింది. దారీ తెన్నూలేక ఒక నిర్ణయానికి రాలేక పోతున్నాడు. పెళ్ళిచేసికొని తానొక ఘోరమైన తప్పుచేశాననుకున్నాడు. కాదు! కాదు! రాధతప్ప యింకెవరైనా అయితే తను సుఖపడేవాడేమో. ఇదేబండి మూడునెలలక్రితం తనూ, రాధ యిలాగే ప్రయాణంచేశారు. అప్పుడు పరిస్థితులు వేరు. కళకళలాడుతూ, నవ్వుకుంటూ తనప్రక్కని కూర్చుని ఎన్నో కులాసాకబుర్లు చెప్పిందే! తలలో తురుముకున్న సంపెగవాసనలతో, ఒంటికి పూసుకున్న అత్తరుతో తనని మత్తెక్కించిందే! ఆమె కబుర్లువింటూ ఆమె తలను తన వ్రేళ్ళతో నిమురుతూంటే ఆనందంగా తన గుండెలమీద వ్రాలిందే! తన చేతులలో యిరుక్కొని, చిరునగవుతో తనపెదిమలకు పెదిమలు కలిపి అమరసుఖం అనుభవించిందే! అప్పుడు తానొక గొప్ప అదృష్టవంతుడ ననుకున్నాడు. కాని యిప్పుడు కథ అంతా అడ్డంతిరిగింది.

జీవితం విదేశభాషవంటిది. అందుకే దాని ఉచ్చారణ ఎవ్వరికీ సరిగ్గా తెలియదు. జీవితంపై తియ్యని కలలుగన్న మధు తను పొరబడ్డాననుకున్నాడు. ఏమిటో! ఈ స్త్రీలంతా యింతేనేమో. స్త్రీని నమ్మడం సాధారణంగా ప్రతీమానవుడూ చేసే పొరపాట్లలో ఒకటి. అదే తనూ చేసాననుకున్నాడు. తన స్నేహితులను తలచుకున్నాడు. వాళ్ళెంతో సుఖంగా కాపురాలు చేసుకుంటున్నారే! వాళ్ళపై అసూయ, భార్యపై ఎక్కడలేని కోపం కలిగింది. తనని పెళ్ళాడమని ఎంతమంది రాలేదు. లలితకు తనపై ఎంతయిష్టం, మోజు. ఎప్పుడూ తనవైపే గ్రుడ్లప్పగించి కాలేజీలో చూచేది. ఇప్పుడు పెళ్ళిచేసికొని వెళ్లిపోయింది.

నిర్మలమాత్రం నోటితో చెప్పలేకపోయింది. "ఐ లవ్ యూ" అని పుస్తకం మీద ఏమీ ఎరగనట్లు వ్రాసిందికదూ. అమెకు పెండ్లి అవలేదు. అయినా, యిప్పుడు తనెలా యింకొకరిని చేసికోగలడు. ఈ పుస్తి ఎలా త్రెంచివేయగలడు. దీనికొక కట్టుబాట్లున్నాయిగా. బండి ఆగినట్లయింది. తన ఆలోచనాసముద్రమునుండి బైటపడ్డాడు. టైం రెండయింది. "గరమ్ ఛా" అంటూ ఛా వాడు వచ్చాడు, తనొకటి తీసికున్నాడు. ఇద్దరిని చూసి, "యింకొకటి యివ్వనా" అన్నాడు వాడు. ఆమె అడగనూలేదు. తనేమీ అనలేదు. మళ్లీ రైలు కదిలింది. ఇంకొకగంటకు వాళ్ల ఊరు వచ్చింది. ఈ రైలు సరిగ్గా టైము ప్రకారం వచ్చినందుకు సంతోషించాడు. ఈ రోజుల్లో సరిగ్గావచ్చేరైలేది. బయలుదేరిందిమొదలు అన్నీ అటంకాలే యీ రైళ్ళకు. పాపం అవైనా ఏంచేస్తాయి. ఇంత ఇంగితజ్ఞానమున్న మనమే టైముకి ఏపనీ చేయలేము. ప్రాణంలేని మిషన్లు ఎలాగ నడిపిస్తే అలాగ నడుస్తాయి. ఇద్దరూ బండిదిగారు. ఆమె చిన్న టాయిలేట్ సూటుకేసు ఈయనగారు హ్యాండ్ బ్యాగ్.

అది ఒక చిన్నస్టేషనైనా ప్రత్యేకించి ఒక వెయిటింగురూము మాత్రముంది. అది రావటానికి కారణం రాధతండ్రి చౌదరిగారే. వారు 10 మైళ్ళలోయున్న ఆ పల్లిటూరికి జమీందారులాంటివారు. వారిదే ఆ వూరికి పెద్దభవనం. భూములూ తోటలూ బాగా ఉన్నాయి! మంచి గౌరవమూ, పేరుప్రతిష్ట లున్నాయి. కొడుకు మూర్తిని మంచి డాక్టరునిచేసి, ఆ వూరిలో భార్య జ్ఞాపకార్థము పెద్ద ఆస్పత్రిని కట్టిద్దామని పని మొదలుపెట్టి కలలు కంటున్నాడు. మూర్తి, మధు బి. ఎ. వరకు ఒక దగ్గరే చదువుకొని విడిపోయారు. మూర్తి ప్రోద్బలంమీదే చెల్లెలిని మధుకిచ్చి పెండ్లిజరిగింది. బండిదిగిన వీళ్ళిద్దరినీ

చూచిన వెంకన్నతాత "బుల్లెమ్మగారు వచ్చారా" అంటూ వెయిటింగురూము తలుపు తీసాడు. అది కట్టిందిమొదలు దానికి కాపలాకాస్తూ, ఇక్కడ మాస్టరు గారింటిపని చేసికుంటూ మంచిగా కాలం గడుపుతున్నాడు

"తాతా, నాన్నగారికి కారుపంపమని ఎవరితోనైనా కబురుపెట్టు అర్జంటుగా వచ్చాం. వారికి తెలిసి ఉండదు."

"నేనేవెళ్ళి చెప్పుతానమ్మగారూ! కొంచెం తెల్లవారనీయండి" అందాక పడుకొండి అంటూ కుర్చీలు దులిపాడు. రాత్రంతా నిద్రలేదేమొ వెంటనే కుర్చీలోనే కునుకుపాట్లుపడుతుంది. మధు ఒక నిర్ణయానికి రాలేక ఆలోచలో పడ్డాడు. కాని యీముసిలోడు ఏమైనా కబుర్లు లోనికి దింపుతాడెమోనని తనూ నిద్రపోతున్నట్లు కళ్ళు మూసాడు. వాడు చుట్ట కాల్చుకోడానికి బయటకుపోగా, తనూలేచి స్టేషనువైపు నడిచాడు. బండి వెళ్ళిపోగానే ఎప్పుడో మాస్టరు నిద్రాదేవి కౌగిట్లో చేరినట్టుంది. పోర్టరు ఒకమూల ముసుగుదన్ని వాడి నల్లగుడ్డలతో చీకట్లో లీనమైపోయి పడుకున్నాడు. పాపం! యీ రాత్రి డ్యూటీలు చేసే రైల్వేవాళ్లు హాయిగా రాత్రులందు యింట్లో పడుకోడానికి నోచుకోలేదు కాబోలు! అని నవ్వుకున్నాడు. ప్లాటుఫారం మీదున్న రెండు గ్రుడ్డిదీపాలూ కిరసనాయిలు దండుగ కాకుండా కాబోలు ఆర్పివేయబడ్డాయి. బండిదిగిన యిద్దరు పల్లెటూరివాళ్ళు బహుశః ఆ చీకటిలో వెళ్ళలేక అచ్చటే ఉండిపోయారు. ఒకడు చుట్టపొగ వదుల్తూ శూన్యంలోకి చూస్తున్నాడు. రెండవవా డేవో పల్లెపదాలు కూనిరాగాలు తీస్తున్నాడు. సిగరెట్టు పీలుస్తూ మధు పచార్లు చేస్తున్నాడు.

ఇంతలో స్టేషనులో గంటవాగింది. మాష్టరుకు నిద్రమత్తు వదలలేదు. గంటలు వాగుతూనే యున్నాయి. కొంతసేపటికి పోర్టరు లేచాడు. యజమానిని లేపాడు. బద్ధకంగాలేచి టైముచూచాడు. ఐదుగంటలయింది. ఫోనులో మాట్లాడి ప్యాసింజరుకు గంటకొట్టమన్నాడు. రాత్రి 2 గంటలకు రావలసిన బండి, ఇంజను పాడవటం మూలాన యిప్పుడు వస్తున్నదని తెలిసికున్న మధుకి ఆలోచన తట్టింది. వెంటనే టికట్టుకొని, బండి వస్తుందనగా తనబ్యాగ్ మెల్లగా తీసికొని, వెంకన్నతాతని పిలిచి, వాడిచేతిలో రూపాయిపెట్టి జాగ్రత్తగా బుల్లెమ్మగారిని చౌదరిగారింటికి పంపమనిచెప్పి వాడు అడిగే ప్రశ్నలకు సమాధాన మివ్వకుండానే తొందరగా బండెక్కి తనవూరు చేరుకున్నాడు.

నౌఖరువచ్చి మెల్లగా లేపేవరకు తెలివి రాలేదు. అప్పటికి ఎనిమిది కావచ్చింది, కాఫి, ఇడ్లి తెమ్మని ప్లాస్కు డబ్బు లిచ్చేసరికి రంగడు "అమ్మగారేరి బాబు"

"అర్జంటుగా వాళ్ళవూరు వెళ్ళింది." అంటూ లేచి కాలకృత్యాలు తీర్చుకుందుకు బయటకు నడిచాడు. రంగడు హొటలు నుండి కాఫీ, టిఫినుతెచ్చి టేబిలుమీద సిద్ధంగా ఉంచాడు. తొందరగా అన్నీ ముగించుకొని తయారై ఆఫీసుకువెళ్లుతూ, మధ్యాహ్నం భోజనం క్యారియరులో తెచ్చి ఉంచమనిచెప్పి వెళ్ళిపోయాడు. ఆఫీసు కెళ్ళిన మధుకు మనస్సు మనస్సులోలేదు. రాత్రి సరిగ్గా నిద్రలేని కారణంగా బద్ధకంగా ఆవలింతలు వస్తున్నాయి. ఇంటికిపోయి విశ్రాంతి తీసికుందామని ఆ రోజు చేయవలసిన పనులు తన అసిస్టెంటులకు అప్పజెప్పి బయలుదేరే సమయానికి అర్జంటు ఉత్తరం టేబిలుమీ దుంచాడు బంట్రోతు. అందులో డివిజనల్ యింజనీరుగారి జిల్లా మొత్తం వారంరోజుల టూరు ప్రోగ్రాంవుంది. బద్ధకం వదలిపోయింది. లేని ఉత్సాహం వచ్చేసింది. వెంటనే తన ఆఫీసువారినందరినిపిలిచి, ఏవీ పెండింగు లేకుండా ఉంచమనిచెప్పి, యిక మిగతా పనులన్నీ తాను స్వయంగా చూచుకొని యిల్లుచేరేసరికి రెండయింది. భోజనం సరిగ్గా నయించలేదు. విశ్రాంతికి గడువుపెట్టి ఆఫీసుపనిలో పడ్డాడు. ఒకవిధంగా యిది మంచిదేమో ననిపించింది. ఇంటిలో భార్యలేని లోటుకు దిగులుగా మరి ఆ విషయమై ఆలోచనకే అవకాశం లేకుండా రాత్రింబగళ్ళు పని తగిలింది. ఆ రాత్రి మత్తుగా నిద్రపట్టింది. ఉదయాన్నే ఆఫీసుకి బయలుదేరే సమయానికి యింటిముందు ఒకరైతు కూర్చున్నాడు. మధుని చూడగానే దణ్ణంపెట్టి ఒక ఉత్తరం చేతికిచ్చాడు. అది చౌదరిగారు వ్రాసింది.

"చిరంజీవి మధుసూదనుకు మీ మామ దీవించివ్రాయునది. నీవు అమ్మాయిని స్టేషనులో విడిచి వెళ్లిపోవడం చాల విచారకరముగా యున్నది. అమ్మాయి అంతాచెప్పి దుఃఖిస్తూయుంది. గృహకలతలు వస్తుంటాయి. వాటిని సర్దుకోవాలిగాని యిలాగ యెన్నాళ్ళు గడుపుతారు. ప్రస్తుతము హాస్పిటలు నిర్మాణములో నాకు తీరికలేకయున్నది. అదీగాక పంటకాలం. గనుక వచ్చుటకు తీరికలేదు. నీవు బుద్ధిమంతుడవు. ఇచ్చటకువచ్చి కొన్నాళ్ళుండి అమ్మాయితో తిరిగి వెళ్లవలసింది. ఈ భవననిర్మాణములో నీ సలహాలు చాల అవసరము. గనుక వెంటనే బయలుదేరి రావలసింది. ఈ పాలేరుకు ఏవిషయమూ తెలిసీవద్దు. అది మనప్రతిష్ఠకు భంగకరము. నీ రాకకై ఎదురుచూస్తూ యున్నాను.

దీనికి సమాధానముగా, "పై అధికారుల టూరుప్రోగ్రాంవుంది గనుక వచ్చుటకు వీలులేదు" అని మాత్రము వ్రాసి కవరులో ఉంచి, వాడికిచ్చి వెళ్లిపోతూ మరల వెనకకు తిరిగి,

ఆ! నీకు రైలుఖర్చులకు, భోజనానికి డబ్బులున్నాయా"

"ఉన్నాయి! బాబయ్యా అన్నిటికీ డబ్బిచ్చి పంపేరు."

"ఈ రూపాయి తీసికో, భోంచేసి వెళ్లిపో, ఆ కవరు యిచ్చివెయ్యి అంటూ రూపాయి చేతిలోపెట్టి చకచక వెళ్లిపోయాడు.

రైతు తెల్లబోయి చూస్తున్నాడు. "అయ్యగారు చాల పనితొందరలో యున్నారు పెద్దదొరలు వస్తున్నారట" అని రంగడు చెప్పేసరికి "ఓహొ" అనుకుంటూ మెల్లిగా అడుగులువేసికుంటూ, ఉత్తరం జాగ్రత్తగా పట్టుకొనిపోయాడు. వాడువెళ్ళిన రెండవ రోజు పోష్టు ఉత్తరం వచ్చింది. తీరుబడిగా ఉన్నప్పుడు వచ్చి, అమ్మాయిని తీసికొని వెళ్లమని ఉంది. ఈసారి మధుకి నిజంగా కోపంవచ్చింది. "సరే చూద్దాం! ఎన్నాళ్ళుంటుందో" అనుకున్నాడు.

గదిలో రాధ వస్తువులేవీ లేకుండా ప్రక్క గదిలోనికిమార్చి తాళంవేసాడు. రాధ ఏ విధంగాను జ్ఞాపకం రాకూడదనుకున్నాడు. కాని అది సాధ్యమా? ఆమెజ్ఞాపకానికి వచ్చి కలవరపెడుతూనే యున్నది. అందుకు రాత్రింబగలు హెచ్చుకాలం ఆఫీసులోనే గడిపేవాడు. రంగయ్యకు యీ ప్రవర్తన అనుమానం కలుగజేయకపోలేదు. అయినా ఏమీ ఎరగనట్లు సమయానికి అన్ని ఏర్పాట్లుచేస్తూ, అన్నీ అమరిస్తూ ఏలోపము రానీయకుండా చూస్తున్నాడు.

అధికారులు రావటం. అంతా చూచి చాల మెచ్చుకోవడం జరిగింది. మధుని చాల మెచ్చుకొని అభినందించారు. ఆ రోజు ఆఫీసులో అందరిముఖాలలో మందహాసం తాండవిస్తోంది. ఇది పురస్కరించుకొని అధికారుల గౌరవార్థం పెద్ద ఎత్తున టీపార్టీ జరిగింది. టీపార్టిలో మధుని అధికారులు ప్రశంసించి, త్వరలో నలుగురు యింజనీర్లు అమెరికా పంపబడతారని, అందులో మధునికూడ చేర్చదలచామని తెలియజేసారు. ఆరోజు అందరికళ్లు మధుమీదే ఉన్నాయి. గొప్ప అదృష్టవంతుడని అందరు పొగిడారు. మధుపొందిన ఆనందం యింతింతనికాదు. కాని ఆ ఆనందం చాటున అతనికి విచారమూ లేకపోలేదు. తన ఆనందాన్ని పంచుకునే భాగస్వామి దగ్గర లేకపోయిందేనని విచారించాడు. పైకిమాత్రం ఎవ్వరికీ తెలియనీయలేదు. అందరి ప్రశంసలతో ఉత్సాహంగా యింటికి చేరేసరికి తొమ్మిదయింది. రంగయ్య వడ్డిస్తూ "ఈ రోజు అమ్మగారుంటే ఏంత బాగుండేది బాబు" అన్నాడు.

"అవును, దానికి అదృష్టం లేదు" అనిసనిగాడు.

"బాబూ, అమ్మగారినికూడ అమెరికా తీసికొని వెళ్తారా" అని ప్రశ్నించాడు. గట్టి ప్రశ్నే వేసాడు ముండాకొడుకు అనుకుంటూ "అప్పుడు చూద్దాంలే" అంటూ భోజనము పూర్తిచేశాడు.

"నేను లేచేవరకు రేపుదయం లేపవద్ద"ని చెప్పి వెళ్ళి తలుపులు వేసికొని పక్కమీద వ్రాలాడు. అమెరికా ప్రయాణముగురించి తీయని తలంపులు వస్తున్నాయి. తానెంత అదృష్టవంతుడు. ఏ కొద్దిమందికో అట్టి అవకాశం లభిస్తుంది. ఆదేశం వేషభాషలు, నాగరికత, అక్కడి ఫ్లేషను, ఆడవాళ్లు....అబ్బ ఒళ్లు పులకరించింది. ఉషారుగాలేచి, రేడియోవేశాడు. "ఓదూరు జానెవాలె, నాదానబూలు జానా" అంటూ సురయ్య పాడుతుంది. పాతవిషయాలు జ్ఞాపకానికొచ్చాయి. అది రాధతో మొదటి పరిచయము. తనెన్నోవాగ్దానాలు చేసాడు. పాటమరి వినలేక రేడియో ఆపి, ఆలోచనలో పడ్డాడు. ఎదురుగా బల్లమీద వార్తాపత్రిక తన్ను పలుకరించలేదన్నట్లు దిగులుగా పడుంది. అది తీసికొని చదవనారంభించాడు. ఎక్కడ చూచినా యుద్ధాలు, హింసలు, తరువాత ఎడ్వర్టైజుమెంట్లు. ఆపైని "అరచేతిలో స్వర్గంచూసే" ఉపన్యాసాలు. దాన్ని ఒక మూలపెట్టి, మేనువాల్చాడు. ఎప్పుడు అమెరికాప్రయాణము నిర్ణయం అవుతుందో. తీరా బయలుదేరడానికి ఏవైనా విఘాతాలు రావుకదా! ఈలోపల శెలవుపెట్టి ఏక్కడికైనా దూరంగావెళ్లిపోతే; అవును! అదే మంచిది. కొన్నాళ్ళు బెజవాడలో తల్లి, తమ్ముడు దగ్గర ఉండవచ్చు. కోడలుగురించి తల్లి అడుగుతుందేమొ! ఏదో బొంకాలి. ఆపైని కొన్నాళ్ళు బెంగుళూరువైపు తిరిగివస్తేసరి. ఈలోగా అమెరికా ప్రయాణంగురించి తేలుతుంది. రఘురాం జ్ఞాపకానికొచ్చాడు. అమెరికాలో పనిచేస్తూ, అక్కడే పెండ్లిచేసికొని ఉండిపోయాడు. వాడికివ్రాయాలి. అచ్చటి పరిస్థితులన్నీ తెలియజేస్తాడు. ఇలాగ ఆలోచిస్తూ ఎప్పుడో నిద్రపోయాడు. ఉదయం లేచేసరికి తొమ్మిదయింది. కాఫీ వగైరా సిద్ధంచేసి రంగయ్య కాచుకు కూర్చున్నాడు. ఆరోజు ఆఫీసుకి ఒకపూట రానని కబురుపెట్టి, యింట్లోనే ఉండిపోయాడు. అప్పటికి రాధవెళ్లి పదిరోజులు దాటాయి. అది తలంపుకు వచ్చినప్పుడు ఎక్కడలేని కోపంవచ్చేది. మంచివాళ్ళకు కోపం రానేకూడదట. వస్తే హద్దుమీరి ప్రవర్తిస్తారు. ప్రతిష్ఠకు భంగము కలిగినప్పుడు, పౌరుషము హెచ్చినకొద్దీ, మనస్సు కాఠిన్యము వహిస్తుంది. కాఠిన్యము వహించిన కొద్దీ, ఎంత యిష్టులైనా ప్రేమను, దయను కోల్పోతారు. తానొక విషమపరిస్థితిలో పడ్డాడు. ఎవ్వరికీ చెప్పుకోలేడు. తనకు తానై ఏ నిర్ణయానికి రాలేకపోతున్నాడు. కన్పించేది ఒక్కటే మార్గము. అదే ఎంత దూరంగా వెళ్ళిపోతే అంతమంచిది. రెండవపూట ఆఫీసుకివెళ్ళి ఒక నెల్లాళ్ళు సెలవుపెట్టాడు, మంజూరు కావటానికి నాలుగైదురోజులు పడుతుంది. ఈలోగా తన అసిస్టెంటులకు పనులన్నీ ఏ విధంగా పూర్తిచేయాలో చెప్పుతూ, హెచ్చుకాలం అఫీసులో గడిపేవాడు. తీరికసమయాల్లో ప్రయాణానికి సరంజామా అంతా తయారు చేసికుంటూ, ముఖ్యమైన స్నేహితులతో మిగతాకాలం గడిపేవాడు, శెలవు పది రోజులే మంజూరయింది. అదైనా ఎందుకు వదలాలని ఆమరునాడుదయం ప్రయాణం పెట్టుకొని, ఆ సాయంత్రం సినిమాకువెళ్లి, సుమారు పదకొండు గంటలకు డాక్టరు సుందరితో యిల్లు చేరేసరికి ఎదురుగా చౌదరిగారు, ప్రక్కను రాధ అగుపించారు. ఇది ఒక అనుకోని సంఘటన.

ఆసమయములో వాళ్లిద్దరినీ చూచి మధు ఆశ్చర్యపోయాడు.

అంతరాత్రప్పుడు తన అల్లుడు ఒక నవయవ్వనవతితో రావటం చౌదరికి ఆశ్చర్యము, అనుమానం ఆగ్రహంకూడా కలిగింది. మధు ప్రవర్తనలో తన కూతురికి కలిగిన అనుమానము సహేతుకమేమోననిపించింది. తనవైపు కొరకొరచూస్తున్న మామను "ఎంతసేపయింది వచ్చి" అని అడుగకుండా ఉండలేకపోయాడు.

"వచ్చి చాలాసేపయింది. మీబంట్రోతు లేకపోతే బైట కారులో కూర్చోవలసి వచ్చేది. అదిసరేగాని మధూ! ఏమిటీ గొడవలు చిన్నపిల్ల. అదేదో అంటే నువ్వైనా సమాధానపరచుకోవాలి గాని తెగతెంపులు చేసుకుంటావా!"

"అదేదో మీ అమ్మాయినే అడగండి?" అనేసరికి, యింతవరకు మౌనంగా బుంగమూతిపెట్టుకొని, గుడ్లగూబలాగ చూస్తున్న రాధ ఒక్కసారిగా కుండ బ్రద్దలైనట్లు,

"అయితే! ఎవరీవిడ" అనేసింది. డాక్టరు సుందరి ఈ ప్రశ్నకు చకితురాలైపోయింది. మధుకి ఎక్కడలేనికోపం, ఆవేశంతో

కండ్లెత్తబడ్డాయి. మామగారు దగ్గర లేక పోతే ఏమిచేసేవాడో. మధునుండి ఏసమాధానమొస్తుందోనని చౌదరి చూస్తున్నాడు. అదేసమయానికి డాక్టరు హరనాధు లోనికి వస్తూ "నమస్కారం చౌదరిగారూ! ఎప్పుడు రావటం. మీరాక మధుకి తెలియదా. మీరికమెండేషనువల్ల, నన్ను నా భార్యను యిచ్చట ఆస్పత్రిలో ఉంచారు. ఈవిడే నాభార్య సుందరి. లేడి సర్జనుగా ఉంది అని భార్యను పరిచయంచేసాడు.

"అలాగా! అయితే మధు మీ కెలా తెలుసు" అని తన అనుమానం వెల్లడి చేసాడు.

"మధు నాతమ్ముడు. వాళ్ళమ్మ. మా అమ్మ అప్పచెల్లెళ్ళు" అంటూ నవ్వుతూ డాక్టరు సుందరి చెప్పేసరికి "అదా సంగతి" అంటూ కుర్చీలో కూలబడ్డాడు. "ఇప్పుడు అర్థమైందా, మీ అమ్మాయి గారికి" అని మధు అనేసరికి, సిగ్గుతో రాధ ముఖం దించేసుకుంది,

"ఏమిటి మధూ! చాల గొడవలు జరిగినట్టున్నాయి, మాతో ఎప్పుడూ అనలేదే. చెప్పు, చెప్పు వింటాం. అని హరనాదు బలవంతంచేసాడు. మధు యిలా చెప్పాడు.

"సాధారణంగా మేమిద్దరం సినిమాలకు కలిసే వెళ్ళేవారము. కాని రెండుసార్లు వరుసగా అనుకున్నట్లు, నేను పని తొందరలో వెళ్ళలేక పోయాను. మూడవసారికూడా అలాగే జరిగింది. కాని ఆరోజు మీరిద్దరూ నన్ను ఆఫీసునుండి అలాగే అప్పటికే అలస్యమయినా ఆఖరి ఆట అని నేను రానంటున్నా సినీమాకు తీసికొనిపోయారు. తిరిగి వస్తున్నప్పుడు దారిలో మీరు అర్జంటుకేసుంటే దిగిపోయారు. కారులో నన్ను యిల్లుచేర్చి అక్క వెళ్ళిపోయింది. తనను తీసికొని వెళ్ళకపోవడమే కాకుండా నేను సినిమాకు వెళ్ళటం, యింటికి మా అక్కతో రావడం చూచిన యీవిడ లేనిపోని అనుమానాలతో ఆ రాత్రి కాళికా రూపం దాల్చింది. నానా హంగామా చేసింది. నన్ను ఏమేమో అంది. వెంటనే వాళ్ళింటికి దిగబెట్టమని నానాగొడవలు చేసింది.

అమెకు పట్టుదల హెచ్చినకొద్దీ, నాకు కోపం రెచ్చిపోయింది. చేసేదిలేక వాళ్ళ వూర్లో విడిచి చక్కావచ్చాను. ఎవరితో చెప్పుకోను యీ సంగతి. అందుకే శెలవు పెట్టి రేపొద్దున్నే మా వూరు బయలుదేరుతున్నాను" అని మధు చెప్పేసరికి చౌదరి ముఖంలో కత్తివాటుకైనా నెత్తురుచుక్క లేనట్లయింది. రాధ గోడకానుకొని తన తప్పిదానికేమో అన్నట్లు కళ్ళవెంబడి నీళ్లు కారుస్తుంది.

డాక్టరుదంపతు లిద్దరూ ఒకరి నొకరు చిలిపిగా చూచుకుంటున్నారు. ఆ వాతావరణంలో నిశ్శబ్దం ఆవరించింది. అమ్మాయినిచూచి, చౌదరికూడ కంట తడిబెట్టకుండా ఉండలేకపోయాడు, కొంతసేపటికి మధు భుజంమీద చేయివేసి, అతి వినయంగా మధూ! యీతప్పంతా నాదే. అది తిరిగి వచ్చిననాడే నేను యిక్కడకు రావలసింది. కాని నాపనులు తెమలక రాలేకపోయాను. నన్ను చూచి దాన్ని క్షమించునాయనా. దాని మేనత్తకూతురి గుణాలొచ్చాయి. తల్లి పోయాక అది యిష్టమొచ్చినట్లు పెరిగింది. ఈ విషయమై పట్టించుకోవడానికి నాకు తీరికే ఉండేది కాదు. నువ్వు బుద్ధిమంతుడువి. దీన్ని ఒక దారికి తీసికొనిరా నాయనా! అంటూ కూతురుని క్షమార్పణ కోరుకోమన్నాడు. రాధ భర్తకాళ్లు పట్టుకుంది. మధు ఏమీతోచక సతమతమవుతున్నాడు. సుందరి కల్పించుకొని, "తమ్ముడూ! రాధను చేరదియ్యి. యింకా చిన్నవయస్సు. తెలిసో, తెలియకో ఏదో అనివుంటుంది.

పొరపాట్లనేవి మానవులకి సహజం. పశ్చాత్తాపానికి మించిన శిక్షలేదు. ఇక మేముంటాంలే. మీయిద్దరినీ ఒక కంట కని పెడుతూయుంటాం" అంటూ రాధని లేవనెత్తి మధుకి అప్పజెప్పింది. చౌదరి తృప్తిగా నవ్వాడు.

"చౌదరిగారూ! రేపు మధ్యాహ్నం వీళ్లిద్దరినీ తీసికొని మాయింటికి భోజనానికి రాండి. అక్కడ అన్నీ మాట్లాడుకుందాం. చాల రాత్రయింది. ఇక మాకు శెలవిప్పించండి." అని డాక్టరు దంపతులు వెళ్ళిపోయారు. మరునాడు వాళ్ళ అతిథిసత్కారముచూసి చౌదరిగారు చాల అభినందించారు.

"టీకప్పులో తుఫాను" వలె వీరిద్దరి తగవు యింత త్వరలో ముగిసినందుకు డాక్టరు హరనాద్ సంతోషము వెలిపుచ్చాడు.

"తమ్ముడూ! రాధకు కూడ నీతో అమెరికాప్రయాణ ముందా?" అని నవ్వుతూ ప్రశ్నించింది సుందరి.

"అమెరికాసంగతేమొగాని, సాయంత్రం బెజవాడ ప్రయాణముంది. మీరిద్దరూ స్టేషనుకు తప్పక రావాలి" అని బ్రతిమాలాడు.

అంతకుముందే అల్లుని ప్రతిభ విన్న చౌదరిగారు ఒక కారుకు అర్డరు యిమ్మని గర్వంగా చెప్పారు.

ఆ సాయంత్రం అందరూ స్టేషనులో కలుసుకున్నారు. బండెక్కిన మధుతో

"తమ్ముడూ! యీసారి మీఅక్క యింట్లో రాధను వదలిరాగలవు" అనేసరికి అందరూ గొల్లున నవ్వారు. వీళ్ల నవ్వులకు తాళంవేస్తూ బండి కదిలింది. కనుమరుగయేవరకు చౌదరిగారు చూస్తూ, డాక్టర్లిద్దరితో స్టేషను బయటపడ్డారు.

"ఆసుపత్రి ప్రారంభోత్సవమునకు తప్పక రావలసిందని" ఆహ్వానించి వారి వద్ద శెలవుతీసికొని చౌదరి కారెక్కుతూ, రంగయ్యకు యిల్లు జాగ్రత్తగా చూచుకో అని వాడిచేతిలో రెండుపదులు పెట్టి హుషారుగా కారు స్టార్టుచేసి వెళ్ళిపోయాడు. ★

---


## కాలు ఆణిమందు

కాళ్లలో యేర్పడు అణికి యీదివ్యమైన ఔషధమును ప్రతిరోజు పైన చరుముకొనివచ్చినచో అణియొక్క మొలకను బయటికి తీసివైచి స్వస్థపరచును. మరల యెప్పటికిని కాలిలో అణి రానేరాదు. బాగుగ మామూలు ప్రకారము పాదములు అణచి నడచుటకు వీలుపడును.

బుడ్డి 1-కి రూ. 1=00

ధనలక్ష్మి అండ్ కో.,

తపాల్ పెట్టె నెం. 1376, మదరాసు-1